విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

విశాలాంధ్ర–ఏలూరు: నేటి యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శ ప్రాయుడని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎన్నికల పరిశీలకులు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. గురువారం పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఏలూరు యంపిడివో కార్యాలయ ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్,జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ,జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడన్నారు.భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో ఏ.వి.ఎన్ ఎస్.మూర్తి, జడ్పీ సీఈవో కె.రవికుమార్, ఆర్‌డిఓలు కె.పెంచల కిషోర్,మల్లిబాబు, ఏలూరు డిఎస్‌పి పైడేశ్వరరావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెం డెంట్ బాలకృష్ణన్, డిఆర్.డి.ఏ. పిడి ఆర్.విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, డ్వామా పిడి డి. రాంబాబు, తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలను అణచివేయాలనుకోవడం దుర్మార్గం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో కార్మిక, ప్రజా పోరాటాలను అణచివేయాలనుకోవడం దురదృష్టకరమని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని కోరుతూ విజయవాడలో జరిగే సత్యాగ్రహానికి, ప్రభుత్వ స్కీం వర్కర్స్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల చలో విజయవాడకు వెళ్ళరాదంటూ భీమవరం పట్టణ పోలీసులు తనకు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావుకు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ప్రాథమిక హక్కులను కాపాడటం కోసం ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు పౌరులందరికీ ఉందన్నారు. తమను అడ్డుకోవడం, గృహనిర్బంధం చేయడం భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకను నొక్కి వేయడానికి, పోలీసుల ద్వారా దుశ్చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. గృహనిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయ లేరని, ప్రజల పక్షాన సిపిఐ, ఏఐటీయూసీ నిత్యం అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా చేస్తామని హెచ్చరించారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - అల్లూరు

ఆర్.ఓ.సి.నెం.3/2023 టెండరు ప్రకటన తేది : 28-02-2023

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, **అల్లూరు** గ్రామ పంచాయతీకి **2023-2024 సం॥మునకు అనగా ది.01-04-2023 నుండి 31-03-2024 వరకు** కాంట్రాక్టు పద్ధతిపై ఈ దిగువ షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకుగాను, సీల్డు టెండర్లు **ది.18-03-2023 తేది మధ్యాహ్నం 12.00గంటల వరకు** గ్రామ పంచాయతి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిగారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడి అదేరోజు **ఉదయం 12.30గం॥లకు** హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు షరతులు, మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళనందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	ధరావత్తు
1.	పి.డబ్ల్యుఎస్ పనులు (1) ఒక వ్యక్తి	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/- లేదా తత్సమానం

గమనిక : 1. గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. గ్రామ పంచాయతీ నిధుల బట్టీ చెల్లింపులు జరుపబడును. 3. టెండరు నిర్వహించుటకు (లేదా)రద్దు పర్చుటకు పంచాయతీకి పూర్తిగా అధికారము కలదు.

సం/- శ్రీ శీలం రామకృష్ణ, సర్పంచ్   సం/- శ్రీమతి పి.వి.నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

గ్రామ పంచాయతీ కార్యాలయం - కోడూరు

ఆర్.ఓ.సి.నెం.3/2023 టెండరు ప్రకటన తేది :15-03-2023

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, **కోడూరు** గ్రామ పంచాయతీకి **2023-2024 సం॥మునకు అనగా ది.01-04-2023 నుండి 31-03-2024 వరకు** కాంట్రాక్టు పద్ధతిపై ఈ దిగువ షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకుగాను, సీల్డు టెండర్లు **ది.19-03-2023 తేది మధ్యాహ్నం 12.00గంటల వరకు** గ్రామ పంచాయతి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిగారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడి అదేరోజు **మధ్యాహ్నం 12.30గం॥లకు** హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు షరతులు, మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళనందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	ధరావత్తు
1.	పి.డబ్ల్యుఎస్ పనులు (1) ఒక వ్యక్తి	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/- లేదా తత్సమానం
2.	పారిశుధ్య సిబ్బంది- (1) ఒక వ్యక్తి	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/- లేదా తత్సమానం
3.	ఎలక్ట్రీషియన్ - (1) ఒక వ్యక్తి	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/- లేదా తత్సమానం

గమనిక : 1. గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. గ్రామ పంచాయతీ నిధుల బట్టీ చెల్లింపులు జరుపబడును. 3. టెండరు నిర్వహించుటకు (లేదా)రద్దు పర్చుటకు పంచాయతీకి పూర్తిగా అధికారము కలదు.

సం/- శ్రీమతి అడుసుమిల్లి కృష్ణకుమారి, సర్పంచ్   సం/- శ్రీమతి పి.వి. నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

గ్రామ పంచాయతీ కార్యాలయం - చినపాలపర్రు

ఆర్.ఓ.సి.నెం.3/2023 టెండరు ప్రకటన తేది :15-03-2023

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, **చినపాలపర్రు** గ్రామ పంచాయతీకి **2023-2024 సం॥మునకు అనగా ది.01-04-2023 నుండి 31-03-2024 వరకు** కాంట్రాక్టు పద్ధతిపై ఈ దిగువ షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకుగాను, సీల్డు టెండర్లు **ది.19-03-2023 తేది మధ్యాహ్నం 3.00గంటల వరకు** గ్రామ పంచాయతి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిగారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడి అదేరోజు **మధ్యాహ్నం 03.30గం॥లకు** హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు షరతులు, మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళనందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	ధరావత్తు
1.	పి.డబ్ల్యుఎస్ పనులు (1) ఒక వ్యక్తి	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/- లేదా తత్సమానం
2.	పారిశుధ్య సిబ్బంది- (1) ఒక వ్యక్తి	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/- లేదా తత్సమానం
3.	ఎలక్ట్రీషియన్ - (1) ఒక వ్యక్తి	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/- లేదా తత్సమానం

గమనిక : 1. గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. గ్రామ పంచాయతీ నిధుల బట్టీ చెల్లింపులు జరుపబడును. 3. టెండరు నిర్వహించుటకు (లేదా)రద్దు పర్చుటకు పంచాయతీకి పూర్తిగా అధికారము కలదు.

సం/- శ్రీమతి మొవ్వ జయలక్ష్మి, సర్పంచ్   సం/- శ్రీమతి పి.వి. నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

దివాలా బడ్జెట్

- జిల్లాకు రిక్తహస్తం
- నవరత్నాలకు కేటాయింపులు
- ఏటా ఇదే తంతు

విశాలాంధ్ర బ్యూరో–ఏలూరు: అనుకున్నదే జరిగింది. నిధుల కేటాయింపులు మెరుపులు మెరిపించారు. గురువారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2023- 24 బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఏటా తంతులాగానే ప్రస్తుత బడ్జెట్లో కూడా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు అన్యాయం జరిగింది. బడ్జెట్ కేటాయింపులలో సింహభాగం నవరత్న పథకాలకు మాత్రమే కేటాయింపులు కనిపించాయి. అభివృద్ధికి సంబం ధించి నిధులు నామమాత్రంగానే కేటాయించారు. జిల్లాలో వ్యవసాయ రంగం,ఆక్వారంగం పట్ల ప్రభుత్వం తొలి నుండి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుంది.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భరోసా లేదు... పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారయ్యింది. ముఖ్యమంత్రి పర్యటించినప్పు డల్లా నిర్వాసితులకు న్యాయం చేస్తానని చెప్పిన మాటలు నీటి మాటలుగా మారాయి. పూర్తి స్థాయిలో నిర్వాసితులకు న్యాయం చేయడానికి నిధుల కేటాయింపులో ఆలసత్వం ప్రదర్శించింది.

ఆధునికీకరణ లేదు...ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో డెల్టా ఆధునికీకరణకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆమోదముద్ర పడింది. అప్పటినుంచి నేటి వరకు ఆధునికీకరణ పనులు మందకొండిగానే సాగుతున్నాయి. గత బడ్జెట్లో ఉభయగోదావరి జిల్లాకు రూ.20 కోట్లు కేటాయించిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నాయి.

ఆక్వా రంగానికి నిధుల ప్రసక్తే లేదు...ఆక్వా రంగంలో రైతులకు జోన్, నాన్ ఆక్వా జోన్ ప్రకటనతో విద్యుత్తు బిల్లులుల భారంతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో ఆక్వా రైతులకు విద్యుత్ పై కనీసం ప్రకటన చేయకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుంది.

వైద్య కళాశాలకు కేటాయింపులు ఏవి.. ?తాను అధికారం చేపట్టగానే జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ని ఏర్పాటు చేస్తానని ఆర్భాటం చేసిన ముఖ్యమంత్రి జగన్ ఏలూరులో, దగ్గులూరు లో విశ్వవిద్యాలయ భవన నిర్మాణాలకు శంకు స్థాపన చేశారు. ఏలూరులో మాత్రం కళాశాల భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

దగ్గులూరు లో మాత్రం ఇంకనూ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుత బడ్జెట్లో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు నిధుల కేటాయింపు ఊసే లేదు.

అటకెక్కిన అభివృద్ధి : సంక్షేమం పేరుతో నవరత్న పథకాలకు నిధులు కేటాయిస్తూ జిల్లాలో అభివృద్ధిని అటకెక్కించారు. జిల్లాలో నడవడానికి, తిరగడానికి వీలు లేనంతగా రహదారులు ఛిద్రమయ్యాయి. రహదారుల అభివృద్ధికి ఈసారి బడ్జెట్లో కూడా అన్యాయం జరిగింది.

రైలు ఢీకొని తల్లీ, కొడుకు మృతి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : నవాబుపాలెం గ్రామం లోని రైల్వే గేట్ సమీపంలో రాజమండ్రి నుంచి విజయవాడ వైపు వెళుతున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఢీ కొనడంతో తల్లి, కొడుకు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. రైల్వే జి.ఆర్.పి.ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం నవాబుపాలెం గ్రామానికి చెందిన బొండాడ వెంకటేశ్వరరావు (47) గత కొంత కాలంగా మతి స్థిమితం లేకుండా మద్యానికి బానిసై జీవిస్తున్నాడు. గురువారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన బొండాడ వెంకటేశ్వరరావుకు తల్లి బొండాడ సుబ్బమ్మ (65) భోజనం పెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో రాత్రి వండిన కూర వెయ్యలేదని తల్లితో గొడవపడిన బొండాడ వెంకటేశ్వరరావు నివాస గృహానికి సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ పైకి వెళ్ళి పరిగెత్తుతుండగా తల్లి పట్టుకోవడానికి వెళ్ళింది. ఈ క్రమంలో తల్లి మాట వినకుండా బొండాడ వెంకటేశ్వరరావు రైలుకు ఎదురుగా వెళ్ళే ప్రయత్నం చేస్తుండగా తల్లి పక్కకు లాగే ప్రయత్నం చేసింది. కొడుకును ప్రక్కకు లాగే ప్రయత్నంలో రైలును గమనించలేదు. ఈ క్రమంలో రాజమండ్రి నుంచి విజయవాడ వైపు వెళ్ళే సింహాద్రి ఎక్స్ ప్రెస్ రైలు ఇద్దరినీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారని ఎస్సై తెలిపారు. గతంలో మృతుడు వెంకటేశ్వరరావుకు వివాహం జరిగింది. మతిస్థిమితం లేకపోవడం వల్ల భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. తండ్రి పక్షవాతానికి గురై మంచానికే పరిమితమై జీవిస్తున్నాడు. వీరిద్దరి మరణం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

- అధికారుల పర్యవేక్షణ శూన్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉపాధి హామీ పనుల అవకతవకలకు అడ్డు లేదా ! సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేదు. కొయ్యల గూడెం మండలం రామనుజపురం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులలో భాగంగా గ్రామంలో ఎస్సీ స్మశాన వాటిక 1 ఎకరం 80 సెంట్లు భూమి ఉండగా ఆ భూమిలో ఉపాధి హామీ కూలీలతో పనులను చేయించారు. ఉపాధి హామీ కూలీలతోనే కాకుండా జెసిబి మిషన్ సాయంతో స్మశాన వాటికలో ఉన్న వివిధ రకాల చెట్లను తొలగించగా సుమారు 7 ట్రాక్టర్ల వరకు కలప లభ్యమైందని ఆ కలపను గ్రామంలో ఎవరికీ తెలియకుండా ఎన్ ఆర్ జి ఎస్ సిబ్బంది అమ్ముకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్‌కి కూడా ఎటువంటి సమాచారం అందజేయకుండా ఎన్ఆర్జిఎస్ సిబ్బంది స్మశాన వాటికలో జెసీబీ మిషన్ సహాయంతో భూమిని చదును చేశారని , ఈ పనులు చూస్తుంటే స్మశాన వాటిక భూమి కూడా కబ్జాకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయని సర్పంచ్ అడపా నాగలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. రామనుజపురం గ్రామ శివారు వెదంతాపురం గ్రామం వెళ్ళు మార్గంలో ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన బంగాళా చెట్లను కూడా నరికివేసి కలపను మాయం చేశారు. గత సంవత్సరం డిసెంబర్ నెలలో మండలంలో నరసన్నపాలెం గ్రామంలో కూడా ఉపాధి హామీ సిబ్బంది గ్రామంలో ఉన్న 85 మంది కరువు పనికి వెళ్లకపోయినా వారి మస్తర్లు వేస్తున్నారని ఆరోపణలు గుప్పుమన్నాయి.ఏపీ డి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్లకు గ్రామస్తులకు మస్టర్ విషయంలో వివాదం నెలకొంది. మండల కేంద్రమైన కొయ్యలగూడెం గ్రామంతో సహా పనికి వెళ్ళని వారి మస్తర్లు వేస్తూ, వారి వద్ద నుండి డబ్బులు గుంజుకుంటున్నారు. రూ.1000కి రూ.200 జాబు కార్డుదారునికి,800 రూపాయలు ఉపాధి హామీ సిబ్బందికి ఇలా వేలల్లో నగదు స్వాహా చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. సంబంధిత మండల అధికారులు కూడా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఉపాధి కూలీలు పేర్కొంటున్నారు. కష్టపడి పని చేసే పేదవాడికి మాత్రం చమట చుక్క మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం జిల్లా యంత్రాంగం దృష్టి సారించి ఉన్నతాధికారులతో విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

గణపవరం మండలాన్ని భీమవరం డివిజన్లో ఉంచాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలాన్ని భీమవరం డివిజన్ లోనే కొనసాగించాలని(ఉంచాలని) కొత్తగా ఏర్పాటు చేస్తున్న తాడేపల్లిగూడెం డివిజన్లో కలపడానికి వచ్చిన గజిట్ నోటిఫికేషన్ పై అభ్యంతరాలు (వినతిపత్రం) గురు వారం గణపవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సిహెచ్ యు కృష్ణస్వామి, ఎంపీడీవో జి.జ్యోతిర్మయికి సమర్పించినట్లు గణపవరం మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షురాలు చనుమూరి లక్ష్మీ భవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డివిజన్లో కలపాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం, ప్రజల అభ్యంతరాలు కూడా అనుకూలంగా రావడంతో పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం డివిజన్లో కలిపినట్లు తెలిపారు. నూతనంగా తాడేపల్లిగూడెం డివిజన్ ఏర్పడడంతో గణపవరం మండలాన్ని ఆ డివిజన్‌లో కలుపుతానని గజిట్ విడుదలైనట్లు ఆమె తెలిపారు. దానికి గణపవరం మండలాన్ని భీమవరం డివిజన్ లో కొనసాగించాలని గణపవరం మండలంలో ఉన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులుతో వినతి పత్రాన్ని తయారుచేసి 45 మందితో సంత కాలు చేయించి అధికారులకు ఇచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైయస్సార్ పార్టీ నాయకులు, చనుమూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూమి సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల సమస్యను పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్ ప్రభుత్వాన్ని కోరారు. వేలేరుపాడు సిపిఐ కార్యాలయంలో కరటం వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తరతరాలుగా ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హక్కు పత్రాలు లేకపోవడం వలన ప్రభుత్వం నుండి అందే ఫలాలు ఆయా రైతులకు అందటం లేదన్నారు. ప్రభుత్వం వారి ఇబ్బందులను గమనించి వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బాడిశ రాము, సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, పిట్టా ప్రసాద్, కురిమెళ్ళ వెంకటేశ్వర్లు, ఎర్ర మధు, పిట్టా సాయమ్మ, మడకం దేశమ్మ, బంధం నాగేశ్వరావు, కారం బొజ్జి తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ చింతలపూడి ద్వితీయ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కామవరపుకోట: ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా ద్వితీయ మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు అన్నారు. మహాసభల కరపత్రాలను ముఠావర్కర్ సీనియర్ కార్యాలయం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతలపూడి ఏరియా అధ్యక్షులు కంకిపాటి బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన సభలో టీవీఎస్ రాజు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఏఐటీయూసీ ఏరియా మహాసభ చింతలపూడి మార్కెట్ యార్డ్ ఆవరణలో జరుగుతుందన్నారు.ఆంధ్ర ప్రదేశ్ లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని సొమ్ము మొత్తాన్ని దిగమింగిన ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు.ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బికె యంయు జిల్లా అధ్యక్షులు మామిళ్ళపల్లి వసంతరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ లు చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సోమరాజు, నల్లమోతుల కృష్ణ, అమృతలూరు సుబ్బరాజు, నల్లమోతుల వెంకటేశ్వరరావు, ఏలూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ విచారణ

విశాలాంధ్ర - కలిదిండి: లోకాయుక్తలో ఇచ్చిన ఫిర్యాదు పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ విచారణ చేశారు. గురువారం మండలంలోని వెంకటాపురం గ్రామం పంచాయతీ పరిధిలో ఇళ్ల స్థలాల లో అవకతవకలు జరిగాయని లోకాయుక్తలో నాగ సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు పై నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేశారు. ఇల్లు ఉన్న వారిని స్థలం ఎవరిది గ్రామ కంఠం భూమా, రిజిస్ట్రేషన్ భూమా ఎవరిది అనేది అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. సుమారు 20 మందిని విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు పట్టాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పట్టాలు లబ్ధిదారుల వద్ద ఉన్నవా లేవా అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. గతంలో ఇచ్చిన పట్టాలు తమ వద్ద లేవని, మాకైతే ఇళ్ల స్థలాలు కేటాయించారు కానీ పట్టాలు మాకు ఇవ్వలేదని కొందరు వాపోయారు. దీనిపై నివేదికను తయారు చేసే ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రాంబాబు వీఆర్వో సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రరావు సర్వేయర్లు అధికారులు తదితరురులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర -భీమవరం: వెహికల్ కండిషన్ మెరుగుపరుస్తామని, డ్రైవర్లు కోరినట్టు అరగంట ముందుగా బస్సులను అందిస్తామని, ఉద్యోగులు అందించిన సల హాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని జిల్లా ప్రజా రవాణాధికారి కె.వీరయ్య చౌదరి అన్నారు. గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో గ్రూప్ ఆఫ్ రూట్ వైజ్ ఎంప్లాయిస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ షెడ్యూల్ సమయాని కంటే అరగంట ముందు బస్సును ఇవ్వాలని, వెహికల్ కండిషన్ మెరుగుపరచా లని కోరారు. అనంతరం వీరయ్య చౌదరి మాట్లాడుతూ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు ఏ రకంగా అందించగలమో, ఎటువంటి మార్పులు చేస్తే ప్రయాణికులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందో సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఉద్యోగులు అధికారులు సమిష్టి కృషితో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించటమే సంస్థ ధ్యేయమని అందరూ కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో భీమవరం డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ పాల్గొన్నారు

హెల్మెట్ ధారణపై అవగాహన

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్లో హెల్మెట్ ధారణ పై ఎస్ఐ నంబూరి చంటిబాబు, సిబ్బంది వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ద్విచక్ర వాహనదారులతో మాట్లాడుతూ శిరస్త్రాణం విధిగా ధరించాలన్నారు. హెల్మెట్ ధారణ వల్ల ప్రమాద తీవ్రత తగ్గి ప్రాణాలు నిలబడతాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై అపరాధ రుసుము విధించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాసనమండలి సభ్యులుగా కౌరు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ ఎన్నిక

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులుగా వైసీపీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ ఎన్నికయ్యారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో కవురు శ్రీనివాస్ 481 ఓట్లు, వంకా రవీంద్రనాథ్ 460 ఓట్లు సాధించారు. స్వతంత్ర్య అభ్యర్థులు వీరవల్లి చంద్రశేఖర్‌కు 122 ఓట్లు రాగా గొరింక దాసు, దేవరపల్లి ఆదాం, పసల వెంకటాచలం ఓట్లు సాధించలేకపోయారు. మొత్తం 1105 ఓట్లకు గాను, 1088 ఓట్లు పోలయ్యాయి, వాటిలో 1063 ఓట్లు చెల్లుబాటుకాగా, 25 చెల్లని ఓట్లు పోలయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్, ఏలూరు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ వి. ప్రశాంతి, ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ , రిటర్నింగ్ అధికారి పి . అరుణ్ బాబు ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం గం.8లకు గట్టి బందోబస్తు మధ్య ప్రారంభయమయ్యింది. ఓట్ల లెక్కింపునకు 5 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 5 టేబుల్స్ వేయగా, ఎన్నికల పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది ఓట్లను లెక్కించారు.ఎమ్మెల్సీ లుగా గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లకు రిటర్నింగ్ అధికారి పి. అరుణ్ బాబు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్సీ లుగా గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ లను ఏలూరు శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం. ఆర్. పెదబాబు, ప్రభృతులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

సంత మార్కెట్ సమీపంలో ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఎంతో కాలంగా ఆక్రమణలో ఉన్న సంత మార్కెట్ వద్ద ముదినేపల్లి గ్రామపంచాయతీ అధికార్లు ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు.సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, భిక్షాలు, ఇఓపిఆర్డి టి.విజయ సారధి, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటరీలు ఈ పనులు పర్యవేక్షించారు . ముదినేపల్లి గురజ రోడ్ సెంటర్ సంత మార్కెట్ నుండి ఇరువైపులా ఈ ఆక్రమణలతో రహదారి కుదించుకుంది. డ్రెయిన్ తో సహా పూడ్చి వ్యాపారాలు చేస్తూ అద్దెలకిస్తూ సంపాదిస్తున్న వ్యాపారులు ప్రతి చిన్న వ్యాపారి వద్ద గ్రామపంచాయతీ స్థలాలు అద్దెకిస్తున్నారంటే వారి హవా ఏరీతిగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రమైన ముదినేపల్లిలో కైకలూరు రోడ్డు, గ్రామపంచాయతీ ఎదుట, గుడ్లవల్లేరు రోడ్డులో ఈ ఆక్రమణలు తొలిగించాల్సి ఉంది. సంత మార్కెట్లో మాంస విక్రయ దుకాణాలు పొందినవారు మరల ప్రధాన రహదారి చెంతన మాంసం విక్రయాలు చేస్తున్నారని ముఖ్యంగా వాటిని కూడా ఇదేక్రమంలో తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల ఈ.కే.వై.సి. 98.23శాతం పూర్తి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో రబీ 2022-23 సీజన్‌లో 2,36,148 ఎకరాలలో 98.23 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయ అధికారి వై. రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఖరీఫ్ సీజన్ కంటే ఈ రబీ సీజన్ లో 9శాతం ఎక్కువ మంది రైతులు ఈ.కే.వై.సి. చేసినట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలలోని ఆర్.బి.కె. ల వద్ద మార్చి 10 వ తేదీన ఈ క్రాప్ ముసాయిదా జాబితాను పెట్టామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆర్.బి.కె. లలో ప్రదర్శిస్తున్న రబీ 2022-23 సీజన్‌కి సంబంధించి ఈ క్రాప్ ముసాయిదా జాబితా ఈ నెల 13 నుండి 17వరకు సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించబడుతుందని, గ్రామ సభలు కూడా నిర్వహించబడుతాయన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజేత శ్రీనివాస్‌కు సన్మానం

విశాలాంధ్ర-ఉంగుటూరు: స్థానిక సంస్థ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన కౌరు శ్రీనివాస్‌ను గురువారం ఎంపీటీసీ సభ్యులు ఏలూరులో మర్యాద పూర్వకంగా కలుసుకొని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఉంగుటూరు మండల సచివాలయం కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, నారాయణపురం ఎంపీటీసీ సభ్యులు బండారు నాగరాజు లు కలుసుకున్నారు. రెండు ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్రీనివాస్ , రవీంద్రనాథ్ లు గెలుపు పట్ల ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఏలూరు జిల్లా వైయస్సార్ సిపి వీవర్స్ సెల్ అధ్యక్షులు దొంతం శెట్టి సత్యనారాయణ, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు పుప్పాల గోపి లు హర్షం వ్యక్తం చేశారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్స రానికి 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఈ నెల 24 వరకూ ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి. రాజారావు గురువారం తెలిపారు. ఐదవ తరగతి ప్రవేశానికి ఎక్కడా డ్రాపౌట్ కాకుండా 2022-23 విద్యా సంవత్సరంలో నాలుగవ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. 1 సెప్టెంబర్ 2010 నుండి 31 ఆగస్టు 2014 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించకూడదని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో పదోతరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 12 గురుకుల పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వాటిలో ఏడు బాలికల పాఠశాలలు, ఐదు బాలుర పాఠశాలలు ఉన్నాయన్నారు. ఐదో తరగతికి 960 సీట్లు, ఇంటర్మీడియట్‌కు 720 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు నెట్ సెంటర్లో గానీ, పెద తాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కానీ సంప్రదించవచ్చన్నారు. విద్యార్థిని ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 23 వ తేదీన ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

కోలాట బృందానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - లింగపాలెం : భోగోలు పంచాయతీలోని వెంకటాపురంలో కోలాటం, భజనలకు శిక్షణ ఇస్తున్న మరిపాటి శ్రీనివాస రావుకు తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి 40 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ నిధుల ద్వారా భజన, కోలాటం ప్రదర్శన చేసేవారికి ప్రదర్శన నిర్వహించేందుకు కావాల్సిన సామాగ్రిని కొనుగోలు చేస్తామని శిక్షణ ఇచ్చిన శ్రీనివాసరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కోలాటం, భజనలకు ఆదరణ కల్పిస్తూ శిక్షణ ఇస్తున్న ఈయనను తపనా సంస్థ వ్యవస్థాపకులు సత్కరించారు.

CHANGE OF NAME

I, **MANTENA VENKATA NARASIMHA RAJU (New Name), S/o, MANTENA NARASIMHA RAJU**, Previously Called **MANTENA SATYANARAYANA RAJU (Old Name)**, Resident of D.No. 2-272, Malavanitippa, Bosu Kolani (Post), Kalavapudi, Kalla Mandal, West Godavari District, Andhra Pradesh. Now Changed my Name from **MANTENA SATYANARAYANA RAJU (Old Name) to MANTENA VENKATA NARASIMHA RAJU (New Name).** Today onwards Use my New Name for all further Transactions.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాముల జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు జిల్లా అదనపు ఎస్పిపివీ సుబ్బరాజు హాజరై, అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గాంధీ భోదించిన సత్యం, అహింసా, హరిజనోద్ధరణకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడన్నారు. భార్య, బిడ్డ చనిపోవడంతో జీవిత సుఖాలపై విరక్తి చెంది, ఉద్యోగానికి రాజీనామా చేసి, గాంధీజీ మార్గదర్శకంలో పని చేసేందుకై సబర్మతి ఆశ్రమానికి చేరి, ఆశ్రమ బాధ్యతలు నిర్వహించి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, పలుమార్లు జైలుకు వెళ్ళిన స్వాతంత్ర్య పోరాటం చేసిన గాంధేయవాదన్నారు. మద్రాసు రాజధానిగా ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు వారి బాధలపైఉద్యమించి, భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఉద్యమించి, ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి, అమరులు అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పి ఎం.సత్యనారాయణ, ఆర్ఐ శ్రీకాంత్, డిపిఓ ఎఓ రామ్మోహన్ , ఎస్బిఎస్ఐ శ్రీనివాస్, డిసిఆర్బీ సిఐ అహ్మద్ ఉన్నిసా, ఇతర పోలీసు అధికారులు, డిపిఓ కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొని, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలను సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు.

కొయ్యలగూడెంలో : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కుంతల గూడెం ఫ్రీ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ పేర్కొన్నారు. పాఠశాలలలోని విద్యార్థుల మధ్య పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన కృషి ఎనలేనిదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. విజయ్, కె. అమృత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలను సైతం అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని ఆర్య వైశ్య మహా సభ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు.స్థానిక బుట్టాయగూడెం రోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీ రాములు విగ్రహం వద్ద 123 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిన్ని రామ సత్యనారాయణ మాట్లాడుతూ రాజధాని లో శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేయాలన్నారు. పొట్టి శ్రీ రాములు జీవిత త్యాగ ఫలమే నేడు రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ చిన్ని సాయికుమార్, వాసవి క్లబ్ సీనియర్ సభ్యులు గుడిమెట్ల యుగంధర్, ఏలూరు ఫణి కుమార్, వాసవి గోల్డ్ అధ్యక్షుడు సురేష్, సెక్రటరీ మణి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుం దని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూలులో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థినులకు ఆంధ్రరాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎమ్.సుధారాణి, చెరుకువాడ రంగసాయి, అరసవిల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. డీఎన్నార్ కళాశాల లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శాంతకుమారి, అధ్యాపకులు గౌతం కుమార్, చెల్లబోయిన రంగారావు, సోమరాజు, సోమయ్య, మిలాంటన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అమరజీవి జయంతి కార్యక్రమాన్ని హౌసింగ్ బోర్డు కాలనీ డెవలెప్ మెంట్ అసోసియేషన్, శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలక వర్గల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కంతేటి వెంకట్రాజు, పెన్నాడ రామారావు, సూర్యనారా యణ రాజు, కుక్కల బాల, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడిపల్లి చంద్రశేఖర్, జానపాటి మధుసూదనరావు, కడలి వెంకటేశ్వరరావులు, చెరుకువాడ రంగసాయి, ఫణి తదితరులు పాల్గొన్నారు. పట్టణ టిడిపి ఆదివారం బజార్ లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వాక్రా అంగన్వాడి రాష్ట్ర ప్రధానకార్యదర్శి మెరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్, నాయకులు ఎద్దు ఏసుపాదం, మైలాబత్తుల ఐసాక్ బాబు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

టి నరసాపురంలో : టి నరసాపురంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమర జీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. ముందుగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అన్నారు. పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండం సత్యనారాయణ మూర్తి, అద్దంకి రవి,మాదంశెట్టి సోమరాజు,అద్దంకి జగ్గా రావు, మండం ఆదిత్య కుమార్, కొనకళ్ళ మోహన్ కుమార్, మాదంశెట్టి మల్లికార్జున రావు,పురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో: స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీతో పాటు పాల్గొని స్వభాష రాష్ట్రం కోసం ఆత్మార్పణకు పూనుకున్న యోధుడు అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు అని శాఖ గ్రంథ పాలకురాలు రాముడు తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గ్రంథాలయం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర గురించి ఆయన చేసిన పోరాటాల గురించి రాముడు విద్యార్థులకు సూచించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, చదువరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

విశాలాంధ్ర -పోడూరు: విద్యార్థులు మహనీయులను స్ఫూర్తి గా తీసుకుని మంచి నడవడికతో తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని శ్రీకనక దుర్గ,శ్రీ వాసవి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బేతాళం సూర్యనారాయణ అన్నారు.పోడూరు శివారు కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో శ్రీకనక దుర్గ,శ్రీ వాసవి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి సేవా సంస్థ చైర్మన్ సూర్యనారాయణ, పాఠశాల హెచ్ఎం కేతా నాగరాజు,పిఎం సి చైర్మన్ చిట్టూరి నరసింహారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల లోని 34 మంది విద్యార్థులకు సేవా సంస్థ తరపున భోజనం ప్లేట్లు అందజేశారు. అనంతరం సేవా సంస్థ చైర్మన్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని త్యాగాన్ని విద్యార్థులకి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం కేతా నాగరాజు,పిఎంసి వైస్ చైర్మన్ కత్తుల సుధ,వాసా దుర్గారావు,వై.శ్రీను,ఎస్ కవిత,విప్పర్తి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి జగన్ ఎస్ సి, ఎస్ టి, బీసీ మైనార్టీ వర్గాల బడుగు బలహీన వర్గాలకి మేలు చేస్తూ ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సర్పంచ్ల ఛాంబర్ ఉపాధ్యక్షుడు ఏలేటిచిన తుక్కయ్య పేర్కొన్నారు. రాజవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద తుక్కయ్య ఆధ్వర్యంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తుక్కయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడుతూ నా ప్రయాణం సామాన్యులతోనే, నా యుద్ధం పెత్తందారుల తోనూ, నా లక్ష్యం పేదరిక నిర్మూలన అని పలికిన మాటలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వారికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గుదే వెంకటేశ్వరరావు, తమిర్చి పండు,ఉస్సే ఆంజనేయులు, దిద్దె ప్రసాద్, తమిర్చి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ : విధుల్లో భాగంగా నిరంతరం బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బందికి క్రీడలు నిర్వహించడం ద్వారా శారీరక , మానసిక ఉల్లాసం లభిస్తుందని ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.ఆర్.కె శాస్త్రి తెలిపారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ సౌజన్యంతో విద్యార్థులకు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి వారం రోజులపాటు నిర్వహించనున్న (పురుషులు, మహిళలకు వేర్వేరుగా) ఇంట్రామ్యురల్ డిపార్ట్మెంట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు.

పురుషులకు క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బ్యాట్మింటన్, చదరంగం, అథ్లెటిక్స్, మహిళకు కబడ్డీ, త్రోబాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉదయం గాని సాయంత్రంగాని వ్యాయామం, ధ్యానం, యోగా వంటి వాటికి కొంత సమయాన్ని వెచ్చిస్తే మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ స్నేహపూర్వక పోటీలు ఆచార్యులు, విద్యార్థుల మధ్య వారధిగా నిలుస్తాయని వివరించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఏప్రిల్ 6న నిర్వహించే సంస్థ వార్షికోత్సవం కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామని వివరించారు. అనంతరం శాస్త్రి చదరంగం ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డీన్ లు డాక్టర్ ఎస్.జయరామ్, డాక్టర్ టి.కురుమయ్య, సాస్ ఫ్యాకల్టీ ఇంచార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ సుదర్శన్ దువా, డాక్టర్ సంతోష్ , డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై జగన్ ప్రభుత్వం మరో బాదుడుకు సిద్ధం

విశాలాంధ్ర - ఏలూరు : ఇప్పటికే తుగ్లక్ నిర్ణయాల వల్ల సతమతమవు తున్న ప్రజలపై జగన్ సర్కార్ మరో బాదుడుకు సిద్ధమవుతోందని జనసేనపార్టీ ఏలూరు నియోజక ఇంఛార్జి రెడ్డి అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ సర్కార్ ప్రజలపై పన్నుల మోత మోగించడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. పట్టణాల్లో ప్రతి ఏటా ఆస్తి పన్ను 15 శాతం పెంచాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించుకుందని దీనిలో భాగంగానే ఏప్రిల్ నుంచి కొత్త పన్నుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు. ప్రజలను ఏమార్చి ఈసారి చెత్త పన్నును కూడా ఆస్తి పన్నులో కలిపేందుకు ప్రభుత్వం సిద్ధవుతోందన్నారు.ఇది ప్రజలపై మరింత భారం మోపడమేనని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2019 దాకా ఒక్క పైసా కూడా ఇంటి పన్ను పెరగ లేదని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఏపీలోని పట్టణాలు, నగరాలలో ఆస్తులున్నవారికి భారీగా పన్నులు వడ్డిస్తున్నారని, దీనికి తోడు అదనంగా చెత్తపన్ను వేసి నడ్డివిరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని రెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో టెక్ ఫ్లీట్-2కే 23

విశాలాంధ్ర -భీమవరం: ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన " టెక్ ఫ్లీట్-2కే 23" పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఇందుకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐటీ డిపార్ట్మెంట్ హెడ్, సింపోజిఎం కన్వీనర్ డాక్టర్ బిహెచ్.వి.ఎస్.రామకృష్ణంరాజు ఇందుకు సంబంధించిన వివరాలు అందిస్తూ విద్యార్థులకు 12 విభాగాల్లో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సి ఎస్ ఐ విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. జాతీయస్థాయి విద్యార్థి సింపోజియంకు ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్‌గా ఐటీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఐ. హేమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.కిషోర్ రాజు వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థి ప్రతినిధులుగా సి ఎస్ ఐ స్టూడెంట్ చాప్టర్ చైర్పర్సన్ ఎస్ జి ఎం ఏ అల్సన్, వాయిస్ చైర్ పర్సన్ జి భువన శ్రీ, కార్యదర్శి ఎం. భాను ప్రసన్న, జి చందన, కీర్తన, వేణుగోపాల్, వరుణ్ తేజ తదితరులు వ్యవహరిస్తున్నారన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్యప్రతీక్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మల కుమారి

విశాలాంధ్ర - గణపవరం: ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. గురువారం మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలురు) ఎకో క్లబ్(ఆవరణ క్లబ్)సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంపై పర్యావరణ పరమైన విషయాలు విద్యార్థులు పాటించాలని దీని వలన ఆసక్తి వారికి కలుగు తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, డాక్టర్ కె. స్వరూపరాణి, డాక్టర్ సిహెచ్ చైతన్య ,శ్రీనివాసరావు, ఎస్.కె పర్వీన్, సిహెచ్ అనురాధ, డివివి చిన సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

"సాంస్కృతిక కార్యక్రమాల పోటీలో బహుమతుల పంపిణీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య, నాటికల పోటీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన పదిహేను మంది విద్యార్థులకు జే.కె.ఎలక్ట్రికల్ వారు హాట్ క్యారేజ్‌లు బహుమతులు గా ఇచ్చారు. విద్యార్థులు అందరికీ వాటర్ బాటిల్స్, శీతాల సత్యనారాయణ పౌచ్‌లు, బురిడి సరభయ్య, పెన్సిల్ బాక్సుల కిట్లు అందజేసారు. వార్షికోత్సవం జరపడానికి దాతలు పంచాయతీ బోర్డు సభ్యులు, పాలమూరి సతీష్, షేక్ మస్తాన్ వలీ, కాళ్ళ రాము, పల్లిశ్రీను, పండు, వంబరిల్లి దుర్గారావు, రామకృష్ణ, దువ్వారపు శ్రీను, షేక్ మస్తాన్, గొట్టాపు వెంకటేష్ గ్రామస్తులు సహకరించారని ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను తెలియజేసారు.

అంకెల గారడీగా బడ్జెట్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : గురువారం ఏపీ శాసనసభలో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాద్ రెడ్డి ప్రవేశ పెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్ తప్పుల తడక, అంకెల గారడీగా ఉందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు విమర్శించారు.జంగారెడ్డిగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ రూ.2 లక్షల 79వేల 279 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడితే దానిలో అన్ని మాయామంత్రాల మాదిరిగా చిత్ర విచిత్రాలతో విన్యాసాలు చేస్తూ అంకెల గారడీలు చేసారని, బీసీల సంక్షేమం కోసం రూ.38,605 కోట్ల కేటాయింపులు చేసినట్టు అంకెలు గాంభీరంగా ఉన్నాయి కానీ ఈ నాలుగేళ్లలో ఒక్క రూపాయి అయినా బీసీల సంక్షేమం కోసం ఖర్చు చేసారా అని ప్రశ్నించారు.59 కార్పొరేషన్స్ పెట్టారనీ వాటి ద్వారా ఒక రూపాయి అయినా ఖర్చు చేసారా, రాయితీలపై ఒక కార్పొరేషన లోన్ అయినా ఇచ్చారా అంటూ ప్రశ్నించారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

విశాలాంధ్ర - ఆలమూరు : చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములని ఆలమూరు ఎంపీడీవో కే జాన్ లింకన్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు మండల ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొట్టీ శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టీ శ్రీరాములు చిరస్మరణీయుడని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారి (ఏవో) వి. రామ స్వరూప్, పలువురు పంచాయతీ కార్యదర్శులు ప్రజాపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లిలో: గండేపల్లి మండలం తాళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు (జివిఆర్) ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న మద్రాస్ నగరంలో జన్మించారని, ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహా పురుషుడని కొనియాడారు. సోషల్ మాస్టర్ మహేష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు లాంటివాళ్ళు పదిమంది ఉంటే దేశానికి ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్ర్యం తెచ్చేవారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహిని, శ్రీవాణి, దీనరత్నం, రమాదేవి, ఎ. సత్యనారాయణ (ఏఎస్ఎన్), రాంబాబు, మహేష్, పిఈటి సత్యనారాయణ, శ్రీనివాసు, తెలుగు శ్రీనివాసు, శాంతి కుమారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో: ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ కమిడిప్రవీణ్ కుమార్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్డి హేమ సుందరి శివన్నారాయణ, 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది ఔట్సోర్సింగ్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో : తెలుగు భాష ఉన్నంత కాలం అమరజీవి పొట్టి శ్రీరాములు బ్రతికే ఉంటారని నిడదవోలు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నిడదవోలు మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనమైన నివాళి లర్పించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 58 రోజులు నిరాహార దీక్ష చేసి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి కారకుడు శ్రీ పొట్టి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ. మాజీ కౌన్సిలర్ కేదారిశెట్టి సునీత, కేదారిశెట్టి రవికుమార్, తెలుగు యువత నాయకులు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు ఎమ్మెల్యే కార్యాలయంలో : భాషాప్రయుక్త రాష్ట్రల కోసం పోరాడి తుది శ్వాస విడిసిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని నిడదవోలు పట్టణ మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఆంధ్ర జాతి ఐక్యత కోసం పోరాడిన మహనీయులు పొట్టి శ్రీరాములు అన్నారు.పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అమలాపురంలో : అమరజీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి మెడికల్ సెల్ కన్వీనర్ కాళ్లకూరి గోపీకృష్ణ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరుపురానిదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పొట్టి శ్రీరాములు రాష్ట్రంగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లాను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా చేసినట్లుగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కూడా అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్రంగా పేరు మార్చాలని ఈ సందర్భంగా గోపి కోరారు.

ఆత్రేయపురంలో : మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాతి బుజ్జి మాట్లాడుతూ పొట్టీ శ్రీరాములు చిరస్మరణీయుడని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవియైన మహాపురుషుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓ (పిఆర్ & ఆర్‌డి) డి శ్రీనివాస్, పరిపాలనాధికారి, టివి సురేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కె కృష్ణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సౌత్ జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థి జయకేతనం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో ఈసిఇ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న కే సాంబశివరావు ఈ నెల 11 మరియు 12 తారీఖులలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2022-23లో సార్ట్ ఫుట్ విభాగంలో గోల్డ్ మెడల్ మరియు డిస్కస్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారని ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా ముందు ఉండేటట్టు ప్రోత్సహించడం జరుగుతుంది అని అందువల్లే ఈ విజయం సాధ్యపడింది అని తెలియజేసారు. ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్ ఎస్‌టి వివిఎస్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయిలో జరిగిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో వివిధ విభాగాలలో తమ విద్యార్థులు మొదటి మరియు ద్వితీయ స్థానాలలో నిలిచారని తెలియజేస్తూ ఈ విజయానికి కారకులైన ఫైజికల్ డైరక్టర్లు కె. రాజు, సిహెచ్ కిరణ్ కుమార్‌లను అభినందించారు. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ డీన్ ఎవి మాధవరావు, హెచ్ & బిఎస్ విభాధిపతులు కె ధర్మారావు, ఎస్. మల్లేశ్వరరావు పాల్గొని విజేతను అభినందించారు.

కొట్లాట కేసులో ఇద్దరిపై కేసు నమోదు

విశాలాంధ్ర - రావులపాలెం : మండల పరిధిలోని కోమరాజులంక గ్రామ లంక భూముల్లో ఎటువంటి అనుమతిలేకుండా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడినందుకు, ఇద్దరు వ్యక్తులు తమ ఇంటిపై దాడి చేసి కొట్టినందుకు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. రావులపాలెం ఎస్సై ఎం. వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఎటువంటి అనుమతులు లేకుండా లంక భూముల్లో మట్టితవ్వుతుండగా గుర్రాల పుల్లేశ్వర రావు, గుర్రాల సత్యనారాయణలు అక్రమ మట్టి తరలింపును ప్రశ్నించినందుకు మంగళవారం రాత్రి సుమారు 9.00 గం.కు అదే గ్రామానికి చెందిన యార్లగడ్డ గణేశ్, యార్లగడ్డ సత్తిపండు, కొంతమంది కలిసి తమ ఇంటికి వచ్చి దాడి చేసి కొట్టినట్లు వారు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటరమణ తెలిపారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్ అందజేత

విశాలాంధ్ర-ఉంగుటూరు : పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి ఏలూరు జిల్లా తరపున కోనా శ్రీనివాస్ సొంత నిధులు రూ.60వేల వ్యయంతో ఒక ఆక్సిజన్ కాన్సంట్రేషన్‌ను ఉంగుటూరు సర్పంచి బందారు సింధు మధు బాబుకు గురువారం అందజేశారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆ గ్రామానికి కోనా శ్రీనివాసరావు, హనుమాన్ బాబులు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా దాత కోనా సోదరులను ఉంగుటూరు గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి కె.వి గిరిధర్, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

మహిళల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర-భీమవరం: హర్యానాలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరగబోయే 69వ జాతీయ స్థాయి సీనియర్ మహిళ ఆంధ్ర కబడ్డీ జట్టుకు ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం గం 9 నుండి ఉమ్మడి గుంటూరు జిల్లా బి.ఆర్. స్టేడియం లో జరుగుతాయని పశ్చిమగోదావరి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, చీఫ్ కోచ్ పి.సురేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలలో పాల్గొను క్రీడాకారిణులు 75 కిలోల లోపు బరువు ఉండాలి, ఆసక్తి కలిగిన క్రీడాకారిణులు పాల్గొనవచ్చన్నారు.

రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

విశాలాంధ్ర - ముమ్మిడివరం, ఐ పోలవరం : నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చింది. గడిచిన 195 రోజులకు గాను రూ.26,92,302 (26 లక్షల 92 వేల మూడువందల రెండు) రూపాయలు హుండీల ద్వారా ఆలయానికి ఆదాయం సమకూరినట్లు చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం దేవాదాయశాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. గ్రా.190 వెండి, బంగారం గ్రా.22.500 మిల్లిగ్రాములు, 3 విదేశీ నోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈమొత్తాన్ని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్‌లో జమ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చక, పురోహిత వైదిక, కార్యాలయం సిబ్బందితో పాటు మురమళ్ల సర్పంచ్ కాలే రాజబాబు, లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ కొలిశెట్టి గంగబాబు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు

విశాలాంధ్ర - లింగపాలెం : వాతావంణంలో మార్పు రావటంతో మెట్ట ప్రాంతపు రైతులు ఆందోళన చెందుతున్నారు. లింగ పాలెం మండలంలోని పలు ప్రాంతాలలో గురువారం చిరు జల్లులు పడ్డాయి. తుపాను ప్రభావం ఉంటుందనే హెచ్చరి కలు రావటంతో ఎండుమిర్చి, నాటు పొగాకు, మొక్కజొన్న పండించిన రైతులు తుఫాను ప్రభావం వల్ల ఎటువంటి పరిస్థితులు తలెత్తుతాయోననే ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఆరుబయట ఉన్న పంటలను భద్రపరచుకోవటంలో రైతులు నిమగ్నమయ్యారు.

అంకెల గారడీ బడ్జెట్

విశాలాంధ్ర -నూజివీడు : మంత్రి బుగ్గన అంకెల గారడి బడ్జెట్ను ప్రవేశపెట్టారని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. బడ్జెట్లో రెవెన్యూ లోటు 22316 కోట్లు పేర్కొన్న బుగ్గన ప్రతి సంవత్సరం లక్షల కోట్ల రూపాయలు రుణాలు ఎందుకు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ఎప్పుడు పేలుతుందో తెలియని రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయానికి బడ్జెట్లో చూపిన అంకెలకు వాస్తవ ఖర్చుకు పొంతన లేదన్నారు. ప్రతి సంవత్సరం పన్నుల పెంపులో ఆంధ్రప్రదేశ్ రికార్డులు సాధిస్తుందని టిడిపి హయంలో ఎటువంటి పన్నులు పెంచకుండా మెరుగైన పాలన అందిస్తే రాష్ట్ర ప్రజలపై మోపలేని భారాన్ని మోపుతున్న జగన్ రెడ్డి ప్రభుత్వం మరోవైపు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తూ మీటర్ నొక్కి ఏ ఖాతాలకు జమ చేస్తుందో అర్థం కాని పరిస్థితి ఉందని ఆయన విమర్శించారు.

నూకాంబిక అమ్మవారి జాతరకు గట్టి బందోబస్తు

విశాలాంధ్ర - ఆలమూరు : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఆరాధ్య దైవమైన కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. గురువారం ఆయన రావులపాలెం సిఐ రజనీ కుమార్, ఆలమూరు ఎస్సై శివప్రసాద్‌తో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెం సిఐ రజని కుమార్ పరివేక్షణలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు ఎస్సైతో పాటు మరో 150 మంది జిల్లాకు చెందిన పోలీసులు, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారనారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. 20వ తేదీ జాతర, 21వ తేదీన తీర్థం, 22వ తేదీన ఉగాది సందర్భంగా బద్ది కదుగుట నిర్వహిస్తారని, ఏప్రిల్ వరకు నెల రోజులు పాటు జరిగే ఈ జాతరకు రెండు లక్షల పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమికఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సచివాలయాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలులో ప్రాథమిక పాఠశాలలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వీక్లీ ఐరన్ ఫోలిక్ సప్లిమెంటరీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆరోగ్య కార్యకర్తలు మీడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఆశ కార్యకర్తలు అంగన్ వాడి కర్తలు ఐరన్ మాత్రలు పిల్లలకు వేసినట్లు పీహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ పులపర్తి సంతోష్ నాయుడు డాక్టర్ పి.కిరణ్మయిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జే విల్సన్ బాబు, హై స్కూల్ హెచ్ఎం లు కె. రాంబాబు, అంబటి అనురాధ, ఆరోగ్య సహాయకులు ఎం ఎస్ యోహన్, ఎ. కృష్ణ ,జి. శ్రీను, కె మార్తమ్మ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.